# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **గుజరాత్‌లోని వదోదరలో యుద్ధ విమానాల తయారీ కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, స్పెయిన్ ప్రధానమంత్రితో కలిసి ఈరోజు ప్రారంభించారు.**
2. **ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.**
3. **రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన కొన్ని గంటల్లోనే ఖాతాల్లో నగదును జమ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు.**
4. **రాష్ట్రంలో ఎంబీబీఎస్ మూడో దశ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయడానికి గడువు పొడిగించామని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం పేర్కొంది.**
5. **దేశవ్యాప్తంగా ఈరోజు నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.**

==========================

గుజరాత్‌లోని వడోదరలో సైనిక యుద్ధ విమానాల తయారీ కేంద్రాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు స్పెయిన్ ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ (Pedro Sanchez)తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ, భారత్ లో రక్షణ రంగ తయారీ వ్యవస్థ నూతన శిఖరాలకు చేరుకుంటోదని అన్నారు. ఈ కర్మాగారం స్పెయిన్ ద్వైపాక్షిక సంబంధాలతో పాటు 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' అంశాలను బలోపేతం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ,

వాయిస్ (32 సెకన్లు )

అంతకుముందు ఇరు దేశాల ప్రధానమంత్రులు వడోదరలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్నారు.

--------------------------

ప్రజా సమస్యల పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా బోరెడ్డిగారిపల్లెలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొని ప్రజలనుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటికి పరిష్కారం అందజేస్తామని తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలకు సంబంధించి అర్జీలు

ఎక్కువగా ఉన్నాయని వాటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి వివరించారు.

---------------------------

రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన కొన్ని గంటల్లోనే రైతుల ఖాతాలకు నగదును జమ చేస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా, కోరుమామిడి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేస్తూ రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తోందని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని మంత్రి పేర్కొంటూ...

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వచ్చేనెల 6వ తేదీన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలు, చర్చించవలసిన అంశాల వివరాలను వచ్చే నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు సాధారణ పరిపాలన శాఖకు పంపాలని అన్ని శాఖల అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు.

---------------------------

అమెరికాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు పెరోట్, టెస్లా సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయా సంస్థలను ఆహ్వానించారు. రాష్ట్రంలో విమానయానం, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అలయెన్స్ టెక్సాస్ తరహా ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం అనుకూలమని, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఓడరేవులు, జాతీయరహదారులు, పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతపురం జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని 'టెస్లా' సంస్థ ప్రతినిధులను కోరామని ఈ అంశాలపై ఆయా సంస్థలు సానుకూలంగా స్పందించాయని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో వైద్య విద్యకు సంబంధించి ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా మూడో దశ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు కళాశాలల్లో రిపోర్టు చేయడానికి రేపు మధ్యాహ్నం రెండు గంటల వరకు గడువు పొడిగించామని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈరోజుతో గడువు ముగియగా, కళాశాలల్లో రిపోర్టింగ్‌కు మరో రోజు గడువు పొడిగించినట్లు ఆరోగ్య విశ్వ విద్యాలయం తెలిపింది.

---------------------------

దేశవ్యాప్తంగా ఈరోజు నుంచి విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. అవినీతిరహిత సమాజాన్ని సాధించేందుకు ప్రజాజీవనంలో నిజాయితీని పెంపొందించేందుకు ఈ వారోత్సవాలను కేంద్ర విజిలెన్స్ కమిషన్ నిర్వహిస్తోంది. "దేశ ప్రగతి కోసం సమగ్రతా విధానం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది వారోత్సవాలు జరుగుతున్నాయి. అవినీతి నిరోధానికి సంబంధించి అవగాహన పెంచేందుకు పాలన వ్యవస్థల్లోనూ ప్రజా పాలన

కార్యాలయాల్లోనూ పారదర్శకత కోసం నవంబర్ 3 వరకు జరిగే ఈ వారోత్సవాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మంత్రిత్వ శాఖలు, వివిధ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు మొదలైన సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేస్తారు.

కాగా.. ఈరోజు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఈరోజు కార్యాలయ అధిపతి ఎమ్. సోమేశ్వరరావు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

---------------------------

విద్యార్థులను ఉన్నత చదువులు, ఉత్తమ–భవిష్యత్ వైపు ప్రోత్సహించేలా పాఠశాల విద్యాశాఖ ప్రతి ప్రభుత్వ పాఠశాలలోను విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ పాఠ్యాంశాల రూపకల్పనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. యునిసెఫ్ ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత శిక్షణ ఈరోజు నుంచి మూడు రోజులపాటు విజయవాడలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తొలుత తెలుగు మాధ్యమంలో శిక్షణ పూర్తయ్యాక, ఆంగ్ల మాధ్యమంలో కూడా అందిస్తామని, దీనిద్వారా ఉపాధ్యాయులు సమర్థవంతంగా విద్యార్థులకు మార్గనిర్దేశం చేసేందుకు ఆస్కారం ఉంటుందని వివరించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీన్ దయాళ్ అంత్యోదయ పథకం కింద జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్‌లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గానూ విజయవాడ నగర పాలక సంస్థ 'ఫెర్ఫార్మెన్స్ రికగ్నేషన్ ఫర్ యాక్సిస్ టు ఫైనాన్షియల్ ఇంక్లూషన్ అండ్ స్ట్రీట్ వెండర్స్ ఎంపవర్మెంట్'– పీఆర్ఎఐఎస్ఈకు ఎంపికైంది.. వీధి విక్రయదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి ఎక్కువ శాతంలో రుణాలు కల్పించినందుకు మెగా అండ్ మిలియన్ ప్లస్ సిటీస్ విభాగంలో 2023–2024 సంవత్సరానికి గాను విజయవాడ నగరపాలక సంస్థ ఈ పురస్కారానికి ఎంపికైందని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్. ఎం. ధ్యానచంద్ర తెలిపారు. రేపు విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ నుంచి కమిషనర్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

---------------------------

దేశ ప్రథమ ఉప ప్రధాని, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతి సందర్భంగా అక్టోబర్ 31న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 'జాతీయ ఐక్యతా దినోత్సవం'ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. ఆ రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు, సిబ్బంది రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయాలని, ఐక్యత, సమగ్రత, భద్రతా భావాల్ని పెంపొందించడానికి పోలీసులు కవాతును నిర్వహించాలని, సమాజంలోని అన్నివర్గాల భాగస్వామ్యంతో 'ఐక్యత కోసం పరుగు' నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

కార్తీక మాసం సందర్భంగా కృష్ణాజిల్లా గన్నవరం నుండి "పంచారామాలు"కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని గన్నవరం డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. గన్నవరంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, వచ్చే నెల 2వ తేదీ నుండి కార్తీక మాసం ప్రారంభమవుతున్న దృష్ట్యా ప్రతీ ఆదివారం, సోమవారాలలో గన్నవరం డిపో నుండి ఒకే రోజు పంచారామాలు దర్శించుకునేలా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

-----------------------------

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే ఆర్టీసీ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో 10 నూతన ఆర్టీసీ బస్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజులలో మరిన్ని నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించి ప్రజలకు సులభతరమైన రవాణా సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

-----------------------------

ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం అదనపు న్యాయమూర్తులుగా కేంద్రన్యాయ శాఖ ఇటీవల నియమించిన ముగ్గురు న్యాయమూర్తులు ఈరోజు నేలపాడులోని రాష్ట్ర హైకోర్టులో ప్రమాణస్వీకారం చేశారు. వారితో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

========================